RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 176 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 5-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ఖలుడి మాట తీరు కాఠిన్యముగ నుండు
పదునుఖడ్గమోలె బాధజేయు
మంచివాడి మాట మాధుర్యముగ నుండు
విరులవోలె మనల మరులగొలుపు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

### విలేకరులు కావలెను


తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



## ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

- శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సీఎం నితీశ్ కుమార్


**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత- కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు.ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో-మిగతా 2 లో



## ముంచుకొస్తున్న శక్తి తుఫాన్

- తీవ్ర తుఫానుగా శక్తి సైక్లోన్..
- గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

**న్యూఢిల్లీ,**
అరేబియా సముద్రం లో శుక్రవారం ఏర్పడిన శక్తి సైక్లోన్ తీవ్ర తుఫాను గా మారిందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. అయితే ఈ తుఫాను భారత తీరానికి దూరంగా పశ్చిమ దిశగా కదులుతోందని ఐఎండీ తెలిపింది. దాంతో భారత పశ్చిమ తీరానికి ముప్పు తప్పినట్లేనని స్పష్టంచేసింది.గడిచిన ఆరు గంటలుగా ఈ శక్తి తుఫాను గంటకు 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోందని ఐఎండీ అధికారులు తెలిపారు. ఇప్పుడు తీవ్ర తుఫానుగా మారడంతో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం సైక్లోన్ శక్తి ద్వారకకు పశ్చిమం వైపు 420 కిలోమీటర్ల దూరంలో, పాకిస్థాన్‌లోని కరాచీకి పశ్చిమ దిశగా 290 కిలోమీటర్ల ఉందని చెప్పారు.కాగా శక్తి తుఫాను ఈ ఏడాది అరేబియా -మిగతా 2 లో



## నగరంలో మరోమారు వర్షం

- వచ్చేనాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్,**
హైదరాబాద్‌లో పలుప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి కొమోరిన్ ప్రాంతం వరకు తమిళనాడు అంతరభాగంగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని తెలిపింది. తమిళనాడు తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పింది. ఈ క్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్,
-మిగతా 2 లో

# నక్సల్స్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదు

**వారు ఆయుధాలు వదిలి లొంగిపోవాల్సిందే**

- ప్రభుత్వ పునరావాస ప్యాకేజీ అందుకుంటే మంచిది
- అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం
- వచ్చే మార్చి నాటికి రెడ్ టెర్రర్‌కు ముగింపు పలుకుతాం
- జగదల్ పూర్ పర్యటనలో కేంద్రహోంమంత్రి అమిత్ షా



**రాయ్‌పూర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి స్పష్టం చేశారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రకటించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 'రెడ్ టెర్రర్'కు ముగింపు పలికేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని..ఆయుధాలు వదిలేసి -మిగతా 2 లో

## రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ పక్రియ

- రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదు
- భూసేకరణలో నాటి బిఆర్ఎస్ నిర్లక్ష్యంలో ఆలస్యం
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**నల్లగొండ,అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ పక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడుతూ.. 2017- 18 లో ప్రధాని మోదీ -మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్

- స్థానిక ఎన్నికల్లో 50శాతం మించి రిజర్వేషన్లు
- సుప్రీంలో పిటిషన్ వేసిన వంగా గోపాల్ రెడ్డి




**న్యూఢిల్లీ,**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ -మిగతా 2 లో

## ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

- సిటీ బస్సుల్లో ఛార్జీల పెంపు
- సోమవారం నుంచి అమల్లోకి ఛార్జీలు



**హైదరాబాద్,**
టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. సిటీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు పేర్కొంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్ ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీల పెంచుతున్నట్లు చెప్పింది. మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీల వసూలు చేయనున్నట్లు సమాచారం. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేయనుంది. అయితే.. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. తాజాగా ఛార్జీల పెంపుపై టీజీఎస్ఆర్టీసీ స్పందించింది. -మిగతా 2 లో



## మరోమారు హైడ్రా దూకుడు

- కొండాపూర్‌లో 36 ఎకరాల్లో ఆక్రమణల కూల్చివేత
- హైకోర్టు తీర్పుతో తాత్కాలిక షెడ్లను కూల్చిన హైడ్రా
- దాదాపు 3600 కోట్ల విలువైన భూమిగా వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భాగ్యనగరంలో హైడ్రా అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని
-మిగతా 2 లో


## స్థానిక ఎన్నికలపై బీజేపీ దృష్టి

**జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం త్రీమెన్ కమిటీ**

**హైదరాబాద్ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమతమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండగా.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 5లోగా ప్రతీ స్థానానికి ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ -మిగతా 2 లో

## భారత్‌కు విచ్చేస్తున్న బ్రిటన్ ప్రధాని..

- రెండు రోజుల అధికారిక పర్యటన ఖరారు..!



**న్యూఢిల్లీ,**
బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మెర్ భారత పర్యటనకు మొదటిసారి రాబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానాన్ని అంగీకరించిన స్టామెర్ రెండు రోజుల పర్యటన కోసం వచ్చే వారం ఇండియాకు విచ్చేయనున్నారు. ఈ విషయాన్ని శనివారం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అక్టోబర్ 8, అక్టోబర్ 9వ తేదీల్లో స్టార్మెర్, మోడీ సమావేశం అవుతారని.. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారని సమాచారం.బ్రిటన్ ప్రధాని పర్యటన సందర్భంగా 'విజన్ 2035' వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చించే అవకాశముంది. ఈ పదేళ్ల ప్రణాళిక భారత్, బ్రిటన్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఆవిష్కరణలు, -మిగతా 2 లో

## బీహార్‌లో ఎన్నికల సంఘం కమిషనర్ల పర్యటన

- పాట్నాలో అఖిలపక్ష నేతలతో చర్చలు
- ఒకేవిడత ఎన్నికలు నిర్వహించాలని కోరిన జెడియూ

**పాట్నా, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నద్ధతపై రెండ్రోజుల పాటు అధికారులతో సమీక్షించేందుకు ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం ఉదయం పాట్నా చేరుకున్నారు. తాజ్ హోటల్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈసీఐ సీనియర్ అధికారులు, బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వినోద్ గుంజ్యాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఈసీఐ అడిగి తెలుసుకున్నారు-మిగతా 2 లో

# ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

(మొదటి తరువాయి)

జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్టాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలన తో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బ్జడెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. ఃాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దు కునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం-సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

# ముంచుకొస్తున్న శక్తి తుఫాన్

(మొదటి తరువాయి)

సముద్రంలో ఏర్పడిన తొలి తుఫానుగా నిలిచింది. రెండు రోజుల క్రితం అరేబియా సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కిలోమీటర్ల దూరంలో, పోరుబందర్‌కు 270 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం ఏర్పడింది.అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తుఫానుగా మారింది. ఇవాళ తీవ్ర తుఫానుగా మారి పశ్చిమదిశగా కదులుతోంది.

# నగరంలో మరోమారు వర్షం

(మొదటి తరువాయి)

నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది.ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, భప్తుప్రాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. బుధశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్

(మొదటి తరువాయి)

జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది. ఇప్పుడు తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టులో వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ.. పిటిషన్‌లో చెప్పుకొచ్చారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లను ఎత్తివేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనికి అన్ని పార్టీల నేతలు అంగీకారం తెలిపారు. ఆ తర్వాత వీటిని గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపారు. అయితే ఈ బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలుపలేదు. రిజర్వేషన్ల బిల్లుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. తమ వద్దనే పెండింగ్‌లోనే ఉన్నాయని ఇటీవల రాజ్ భవన్ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ పడటం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ అని చెప్పవచ్చు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

# నక్సల్స్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదు

(మొదటి తరువాయి)



లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని..పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని..భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు. మళ్లీ చాలా స్పష్టంగా చెబుతున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు. అలా కాకుండా బస్తర్ ప్రాంతంలో శాంతికి భగం కలిగిస్తే సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అమిత్‌షా ప్రశంసించారు. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ.4 లక్షల కోట్లకు పైగా కేంద్రం కేటాయించిందని, రాష్ట్రంలోని గిరిజనుల కోసం పలు పథకాలను బీజేపీ ప్రారంభించిందని చెప్పారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 'స్వదేశీ'కి కట్టుబడితే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా నిలుస్తుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇటీవల జీఎస్టీ రేట్లు తగ్గించడం ద్వారా ఎంతో ఉపశమనం కలిగించారని, స్వదేశీ సంస్కృతికి మనమంతా కట్టుబడితే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు.

# రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ పక్రియ

(మొదటి తరువాయి)

ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని,ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు.4లేన్ల ట్రిపుల్ ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. నల్లగొండ బిడ్డగా..ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోనని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి,చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు. దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారం తోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా అంటూ త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఇటీవల పత్రికల్లో,సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన,ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల క్షఖీఖీ ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు.

# మరోమారు హైడ్రా దూకుడు

(మొదటి తరువాయి)

పోలీసులు అనుమతించండం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా భారీగా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కొండపూర్ లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించడం ద్వారా . దాదాపు 3600 కోట్ల రూపాయల విలవ చేసే 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. దీనిపై గతంలో రైతులకు అనుకూలంగా రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. దీంతో ఉన్నత న్యాయస్థానం సర్కార్ కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పు మేరకు శనివారం ఉదయం నుంచి కొండాపూర్ లోని బిక్షపతి నగర్ ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపును భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది చేపట్టింది. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు.

# బీహార్‌లో ఎన్నికల సంఘం కమిషనర్ల పర్యటన

(మొదటి తరువాయి)

రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరినట్టు జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా తెలిపారు. బిహార్‌లో శాంతిభద్రతల సమస్య కానీ, నక్సల్స్ సమస్య కానీ లేవనీ, మహారాష్ట్రలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించిన తరహాలోనే బిహార్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో కోరామన్నారు. కాగా, ఎన్నికల పక్రియ సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల కమిషన్ కోరింది. మతసామరస్యం, పరస్పర గౌరవం చాటుకుంటూ ఎన్నికల పండుగలో పాల్గొనాలని, ప్రతి బూత్‌లోనూ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితా సవరణకు కమిషన్ తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు గరిష్ట ఓటర్ల సంఖ్య 1,200గా కమిషన్ నిర్ణయించడాన్ని స్వాగతించారు. ఛాత్ పండుగ పూర్తయిన తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ఇందువల్ల ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కమిషన్‌కు తెలిపారు. సాధ్యమైనంత తక్కువ విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఈనెల 6 లేదా 7వ తేదీన ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

(మొదటి తరువాయి)

ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని తేల్చి చెప్పింది. సిటీ బస్సుల్లో మెరుగైన వసతులు కల్పించాలంటే ఛార్జీలు పెంచక తప్పట్లేదు అని వివరించింది. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. సిటీ బస్సుల్లో పెరిగిన ఛార్జీలపై నగరవాసులు సహకరించాలని టీజీఎస్‌ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలోని వివరాల ప్రకారం..

# స్థానిక ఎన్నికలపై బీజేపీ దృష్టి

(మొదటి తరువాయి)

రావు.. పార్టీ నాయకులను ఆదేశించారు. జట్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత రాష్ట్ర కమిటీకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత జిల్లా పార్టీ కోర్ కమిటీలకు అప్పగించనున్నారు. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. దీని కోసం ముగ్గురు సభ్యులతో కమిటీని బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో అభిప్రాయ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ధర్మరావు, మాజీ ఎంపీ రాములు, అడ్వకేట్ కోమల ఆంజనేయులుకు చోటు దక్కింది. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. మరోవైపు జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల నుంచి వివరాలు సేకరిస్తోంది. గ్రామస్థాయి నుంచి గెలుపు గుర్రాలపై దృష్టి సారించింది.

# భారత్‌కు విచ్చేస్తున్న బ్రిటన్ ప్రధాని..

(మొదటి తరువాయి)

రక్షణ, భద్రతపరమైన అంశాలకు సంబంధించినది. అంతేకాదు శక్తి, ఆరోగ్యం, విద్య, ప్రజల మధ్య సంబంధాల పురోగతి కోసం ఈ విజన్ 2035 ఉపయోగపడనుంది. పర్యటనలో రెండో రోజైన అక్టోబర్ 9న మోడీతో కలిసి స్టార్మెర్ ముంబైలో వ్యాపార, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు.ఇరుదేశాల మధ్య క్రాంప్రెహెన్సివ్ ఎకనామిక్ ట్రేడ్ అగ్రిమెంట్ లో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం అంశాలపై కూడా మోడీ, స్టార్మెర్ మధ్య చర్చ జరిగే అవకాశముంది. అనంతరం .. ఇరువురు 'గ్లోబల్ ఫిన్‌టెక్' ఆరో సీజన్ వేడుకలో పాల్గొంటారు. ఈ ఏడాది జూన్‌లో మోడీ బ్రిటన్ పర్యటనకు వెళ్లారు. అక్కడ స్టార్మెర్‌ను అధికారిక నివాసం 'చెకర్స్'లో కలిసిన మోడీ.. 2035 స్ట్రాటజీని ప్రస్తావించారు. ఈ సమయంలోనే భారత్, బ్రిటన్ ప్రతినిధులు మధ్య రక్షణ, పారిశ్రామిక రోడ్‌మ్యాప్‌పై సంతకాలు చేశాయి.

# “అర్జెంట్” అంటూ ప్రాణాలతో చెలగాటం..!

**షాద్ నగర్ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం**




**షాద్ నగర్, అక్టోబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్టీసీ డిపో నుండి శనివారం ఉదయం 10:10 గంటలకు హైదరాబాద్ వైపు బయలుదేరిన బస్సులో ఓ నిర్లక్ష్య ఘటన కలకలం రేపింది. బస్సు నంబర్ టీఎస్ 07 యుజే 888. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూనే స్టీరింగ్ వదిలేసి విన్యాసాలు చేస్తూ ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టాడు.

**అరగంట పాటు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్..!**
షాద్ నగర్ చౌరస్తా నుండి శంషాబాద్ వరకు డ్రైవర్ నిరంతరం ఫోన్ మాట్లాడుతూ, రెండు చేతులతో ఫోన్ పట్టుకొని స్టీరింగ్ వదిలేసి డ్రైవింగ్ చేయడం ప్రయాణికుల గమనానికి వచ్చింది. బస్సులో ఉన్న ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వచ్చింది.

**“అర్జెంట్ ఉంది” అంటూ బేఖాతరు సమాధానం**
బస్సులో ప్రయాణిస్తున్న విట్యాల గ్రామానికి చెందిన ఇసాక్ అనే యువకుడు డ్రైవర్‌ను ప్రశ్నించగా, “నాకు అర్జెంట్ ఉంది” అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయన్న విషయాన్ని పట్టించుకోకుండా, అదే తీరులో డ్రైవింగ్ కొనసాగించాడు.

**వీడియోలో స్పష్టంగా కనిపించిన విన్యాసాలు**
ఇసాక్ తీసిన వీడియోలో డ్రైవర్ రెండు చేతులతో ఫోన్ పట్టుకొని, స్టీరింగ్ వదిలేసి డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ఇది ఆర్టీసీ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**ప్రభుత్వ ప్రచారానికి విరుద్ధంగా డ్రైవర్ల ప్రవర్తన**
ప్రభుత్వం “ఆర్టీసీ ప్రయాణం సురక్షితం” అంటూ ప్రచారం చేస్తుంటే, డ్రైవర్లు మాత్రం నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం సర్వత్రా ఆక్షేపణకు గురవుతోంది. ఈ ఘటనపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## 2025 అక్టోబర్ 5, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
శుక్ల పక్షం
తిథి
త్రయోదశి: అక్టోబర్ 4 సాయంత్రం 5:09 అక్టోబర్ 5 మధ్యాహ్నం 3:04 వరకు
చతుర్దశి: అక్టోబర్ 5 మధ్యాహ్నం 3:04 అక్టోబర్ 6 ఉదయం 11:38 వరకు
నక్షత్రం
శతభిషం: అక్టోబర్ 4 ఉదయం 9:09 అక్టోబర్ 5 ఉదయం 8:01 వరకు
పూర్వభాద్రపద: అక్టోబర్ 5 ఉదయం 8:01 అక్టోబర్ 6 ఉదయం 6:28 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:34 - 5:22
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:28
అమృతకాలం: ఉదయం 8:25 - 9:56
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 4:32 - 6:00
యమగండం: మధ్యాహ్నం 12:05 - 1:33
గుళికా: ఉదయం 3:03- 4:32
దుర్ముహూర్తం: సాయంత్రం 4:09 - 4:56, రాత్రి 9:01 - 9:48
వర్జ్యం: రాత్రి 8:25- 9:56

# జంతువులను ప్రేమిద్దాం.. వాటినీ బతుకనిద్దాం

**నిచ్చనమెట్ల రాజేంద్ర ప్రసాద్**





**మహబూబ్ నగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవాన్ని అక్టోబర్ 4న జరుపుకుంటారు. జంతువుల హక్కులు, సంక్షేమం, సంరక్షణపై అవగాహన పెంచే దినంగా ఇది గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా పాలమూరు సేవాభూషణ్, సేవజ్యోతి అవార్డు గ్రహీత నిచ్చనమెట్ల రాజేంద్ర ప్రసాద్ ప్రజలకు సందేశం ఇచ్చారు.“మానవులు మాటలతో, సైగలతో అవసరాలు తెలియజేస్తారు. కానీ మూగజీవాలు ఎలా చెప్పగలవు?” అని ప్రశ్నించిన ఆయన, “ఆహారం, నీరు ఇవే వాటికి అవసరం. మనకున్న దానిలో కొద్దిగా పంచితే చాలు. బెల్లం, పిండి, ఆకుకూరలు, గడ్డి, చిరుదాన్యాలు, నీరు ం ఇవి సమయానుకూలంగా అందించాలి” అని సూచించారు.గతంలో చిన్నధర్పల్లి గోశాలలో గోవుల రక్షణ కోసం గోడ నిర్మాణం చేపట్టినట్లు, అలాగే గ్రాసం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. “మూగజీవాల పట్ల మానవీయత చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత” అని అన్నారు. జంతు జాతుల అంతరించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, “ఎకాలాజికల్ బ్యాలెన్స్ కోసం వాటిని పరిరక్షించాలి. సహజసిద్ధమైన ఆవాసాలు కల్పించాలి. ప్రపంచవ్యాప్తంగా సమర్థవంతమైన జంతు నియంత్రణ కార్యక్రమాలు అవసరం” అని పేర్కొన్నారు. ‘మనతో పాటు జంతువులనూ బతుకనిద్దాం. వాటికి తగిన గౌరవం ఇవ్వడం మనందరి బాధ్యత” అని ఆయన హితవు పలికారు.

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మర్రి నిరంజన్ రెడ్డి



**ఇబ్రహింపట్నం, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విజయ దశమి ( దసరా ) పర్వదినం సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు టిపిసిసి సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. తన నివాసంలో ఆదిభట్ల మున్సిపాలిటీ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సంద్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... చెడుపై మంచి, అధర్మం పై ధర్మం గెలిచిన గొప్ప పర్వదినం విజయదశమి. ఈ దసరా పండుగ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచే దసరా పండుగను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ, జీవితంలోని ప్రతి అవరోధంపై విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

# దసరా పర్వదినం సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును కలిసిన నేతలు



**కుత్బుల్లాపూర్,అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు నివాసంలో మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంత్ రావు, రాష్ట్ర యువనాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం, దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, చేపట్టే ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, సొసైటీ చైర్మన్ నరేందర్ రాజు, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కుంటిమల్ల కలమ్మ మృతి



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆదిభట్ల మున్సిపాలిటీ ,ఎంపీ పటేల్ గూడ గ్రామంలో కుంటిమల్ల కలమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు...అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

# గోవింద్ హెూటల్ చౌరస్తాలో డ్రైనేజీ పైప్ లైన్ పగుళ్లు

**-పునరుద్ధరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్**



**ఆల్విన్ కాలనీ,అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గోవింద్ హెూటల్ చౌరస్తా వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో, వెంటనే చేపట్టిన పునరుద్ధరణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “గోవింద్ హెూటల్ చౌరస్తా వద్ద డ్రైనేజీ పైప్ లైన్ పగిలిపోయిన విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాను.
చాలా సంవత్సరాల క్రితం వేసిన పాత పైపులు అవడం వల్ల వాటి జీవిత కాలం తగ్గి, అకస్మాత్తుగా పగిలిపోవడం జరిగింది. ఇటువంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతాం” అని తెలిపారు.జలమండలి, మహానగర పాలక సంస్థ, ట్రాఫిక్ విభాగం అధికారులు పరస్పర సమన్వయంతో పునరుద్ధరణ పనులను తక్షణమే ప్రారంభించారని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ప్రజల నిత్యజీవితానికి అంతరాయం కలగకుండా సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి


**ఎన్నం ప్రకాష్**



**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు తమ ఐక్యతను చాటాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ పిలుపునిచ్చారు.
కరీంనగర్ నగరంలోని మాకమ్మతోటలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ధోగ్గలి శ్రీధర్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్నం ప్రకాష్ మాట్లాడుతూ, బీసీ అభ్యర్థుల గెలుపు కోసం అన్ని బీసీ సంఘాలు కలిసికట్టుగా పనిచేయాలని, పార్టీలకతీతంగా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని 42 శాతం జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించకపోతే, రాజకీయ పార్టీల ప్రకటనల ద్వారా మాయ మాటలు చెప్పే ప్రమాదం ఉందని, దీనిని బీసీ నాయకులు గమనించాలని సూచించారు.బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత లేకుండా ఎన్నికల్లో వస్తే, వారి అభ్యర్థులకు డిపాజిట్ రాకుండా చేస్తామని హెచ్చరించారు. కోర్టులో జీవో అమలు కోసం ప్రయత్నించాలని, బీసీలు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జనరల్ స్థానాల్లో కూడా బీసీలు తమ సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రాచమల్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల సురేందర్, జిల్లా కార్యదర్శులు బండారు మల్లయ్య, నల్లవెల్లి రవి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మదాసు సంజీవ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.


# అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**మర్రి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందచేత**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన ఆబేద్ బేగంకు 60,000, లోయపల్లి గ్రామానికి చెందిన కొర్ర దశరథకు 60,000 విలువైన చెక్కులు అందజేశారు. ఈ చెక్కులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మంజూరయ్యాయి.అనంతరం మాట్లాడిన మర్రి నిరంజన్ రెడ్డి, “ప్రతి సంవత్సరం వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య అవసరాలకు ఆర్థిక చేయూత అందుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇప్పటికే వందలాది మంది లబ్ధిదారులకు ఈ నిధి ద్వారా సహాయం అందినది,” అని తెలిపారు.ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# మద్యానికి బానిసై యువకుడు మృతి



**ఎలిగేడు, అక్టోబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మండల కేంద్రానికి చెందిన కోడూరు రాజేశం(35) అనే యువకుడు శనివారం మద్యానికి బానిసై చనిపోవడం జరిగింది. ఎలిగేడు మండల ఏఎస్ఐ బి. రామచంద్రం తెలిపిన వివరాల ప్రకారం. మృతుడు ఎలక్ట్రిషన్ పనిచేసుకుంటూ తన భార్య సౌందర్య తో కరీంనగర్ లోని ఇందుపురి కాలనీలో నివాస ఉంటున్నట్లు తెలిపారు. మృతుడు రాజేశం ప్రతిరోజు మద్యం తాగి వచ్చి ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించేవాడని నెల రోజుల క్రితం సౌందర్య నాన్న పోతు సత్యనారాయణ మరణించగా అక్కడికి తాగిన మైకంలో వచ్చి గొడవ చేయగా రాజేశం అన్న ఆంజనేయులు వచ్చి దసరా పండుగ తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం అని చెప్పి రాజేశం ను ఎలిగేడుకు తీసుకువచ్చాడు. శుక్రవారం రాత్రి నుండి రాజేష్ కనిపించడం లేదని మృతుడి భార్య సౌందర్య కు ఆంజనేయులు ఫోన్ చేసి చెప్పాడు. తెల్లవారిన ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల వెతుకగా ఎలిగేడు ప్రభుత్వ గొర్రెల ఉన్ని కేంద్రంలో బాగా తాగిన మైకంలో రాజేశం చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య సౌందర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ తెలిపారు.

# పాత్రికేయుల సేవకు అంకితభావంతో బుర్ర ఆంజనేయులు గౌడ్

**ఎలిగేడులో ఆలయ పునర్నిర్మాణానికి విరాళం, ప్రెస్ భవన్ ఏర్పాటుకు హామీ**



**ఎలిగేడు, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "ప్రజాస్వామ్యంలో పాత్రికేయులది కీలకపాత్ర" అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ సభ్యులు బుర్ర ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం ఆయన స్వగ్రామం ఎలిగేడులోని హనుమాన్ మార్కండేయ ఆలయం మరియు రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆలయానికి 10,116 విలువైన చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ వెంగళ దాస్ రాజమౌళికి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చిన్నతనంలో ఆడి పాడిన స్మృతులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గ్రామంలోని పలువురు నాయకులు, పద్మశాలి సంఘం సభ్యులు, ఎలిగేడు మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో అతి పురాతనమైన ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన నిధుల విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండల పరిధిలోని పాత్రికేయుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని, మండల కేంద్రంలో ప్రెస్ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోడూరు కైలాసం, కల్వల శంకర్, ముంజంపల్లి కొమురయ్య, చందు, రంగు తిరుపతి గౌడ్, భూకాల సారయ్య, ముతికెల శ్రీధర్, ప్రశాంత్, సంపత్, సందీప్, తాటిపల్లి సతీష్ బాబు, మామిడాల రమేష్, వెంగళ దాస్ రాజమౌళి, కోడూరి శ్రీనివాస్, కుసుమ రమేష్, వెంగళ దాస్ శ్రీనివాస్, పోరండ్ల కుమారస్వామి, గ్యాజంగి రాజు, కట్ల ప్రతాప్, మాజీ సర్పంచ్ రాజనర్సయ్య, రంగు శ్రీనివాస్ గౌడ్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, కవ్వంపల్లి కొండయ్య, నారాయణ అర్చకులు బండవరం నవీన్ కుమార్, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**లక్కీ డ్రా, బహిరంగ వేలం పాటలతో ఉత్సాహంగా సాగిన కార్యక్రమం**



**మంచాల, అక్టోబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** లోయపల్లి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. గ్రామ కమిటీ సభ్యులు సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల హృదయాలను హత్తుకునేలా సాగాయి. దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక అలంకరణలతో అమ్మవారిని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లక్కీ డ్రాలో బంగారు ముక్కు పుడక (2 గ్రాములు)ను బైరు సహస్ర అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ వేలం పాటలు మరింత ఉత్సాహాన్ని నింపాయి. అమ్మవారి పట్టు వస్త్రాలను బండి సత్తయ్య 1,75,000కు, అమ్మవారి వెండి కలశాన్ని బీమగోని వెంకటేష్ గారు 83,000కు చేజిక్కించుకున్నారు. హెూరాహెూరీగా సాగిన ఈ వేలం పాటలు గ్రామస్థుల ఆసక్తిని రేకెత్తించాయి. భక్తి, శ్రద్ధ, సమర్పణతో కూడిన ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు లోయపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. గ్రామ సమాజం సమష్టిగా పాల్గొన్న ఈ కార్యక్రమం, దేవి భక్తుల మనసులను ఆనందంతో నింపింది.

# నిరుపేదలకు వరంగా మెగా వైద్య శిబిరం

**కొంపల్లిలో ప్రారంభించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



**కొంపల్లి,అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో "ఇస్మాయిలీ సివిక్" ఆధ్వర్యంలో, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిరుపేదలకు వరంగా నిలిచే ఉచిత వైద్య శిబిరం ఇది. అనేక సంవత్సరాలుగా సేవా మార్గంలో ముందుకు సాగుతున్న ఇస్మాయిలీ సివిక్ సంస్థ అభినందనీయమైన పని చేస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసి, మరింత మందికి వైద్య సేవలు అందించేందుకు మా పూర్తి సహకారం ఉంటుంది" అని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పదికి పైగా ప్రముఖ ఆస్పత్రులు పాల్గొని, 400 మందికి పైగా నిరుపేదలకు వైద్య సేవలు అందించడం విశేషంగా నిలిచింది. వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, ఆరోగ్య సలహాలు వంటి సేవలు శిబిరంలో అందుబాటులో ఉండటం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారింది. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితాశ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు జంధా కుమార్, సంగీతా రెడ్డి, వేణు యాదవ్, ఇస్మాయిల్ కౌన్సిల్ ఫర్ సికింద్రాబాద్ అధ్యక్షులు ఇక్బాల్ మందని తదితరులు పాల్గొన్నారు.


# చదువుకుంటేనే మంచి భవిష్యత్తు

**మద్రిపల్లిలో వివిధ హెూదాలో సీట్లు పొందిన విద్యార్థులకు ఘన సన్మానం**



**కడ్తాల్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని కడ్తాల్ మండలం మద్రిపల్లి గ్రామస్థులు అన్నారు. గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తేవడంతో గ్రామస్థులు వారిని అభినందించారు. గ్రామానికి చెందిన సురిగి దినేష్ కుమార్ ఒకేసారి నాలుగు సెంట్రల్ ఉద్యోగాలు సాధించారు. సురిగి శ్రీజ గ్రామంలో మొదటి సారి ఎంబీబిఎస్ సిటు సాధించింది. ఈర్లపల్లి శ్రావణి గ్రామంలో రెండవ ఎంబీబిఎస్ సిటు, సుంకరి శివకుమార్ ఓయూలో మెకానికల్ ఇంజనీరింగ్ లో 1వ ర్యాకు, గడిగా పూజ ఓయూలో ఎల్ ఎల్ బీ ఫస్ట్ ర్యంకు, మారమోని గ్రిష్మిక పదిలో 10/10సాధించడం పట్ల గ్రామస్థులు వీరికి శనివారం అభినందన సభ నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీజ, శ్రావణికి ల్యాప్ టాప్ అందించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి మద్రిపల్లికి మంచి పేరు తేవాలని సూచించారు.

# గౌరారం గ్రామంలో ముగిసిన దుర్గ మాత నవరాత్రి ఉత్సవాలు



**ఆమనగల్,అక్టోబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆమనగల్ మండల పరిధిలోని గౌరారం గ్రామంలో శ్రీ దుర్గా మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొమ్మిది రోజులు అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నాగర్ కర్నూల్ బిజెపి కౌన్సిల్ సభ్యులు సింగం శ్రీనయ్య, చిటుగోరి లక్ష్మమ్మ నరసింహారావు, వేలం పాటలో అమ్మవారి చీరలు దక్కించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆమనగల్ మండల బిజెపి ప్రధాన కార్యదర్శి చిటుగోరి సీతారాం రావు, నాయకులు నిట్ట కొండలు, గోరేటి శివ, గునిగంటి తిరుపతి గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా మచ్చ జంగయ్య నియామకం



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం,కాగజ్‌ఘాట్ గ్రామానికి చెందిన మచ్చ జంగయ్య శనివారం నియామకమయ్యారు. ఈసందర్భంగా మచ్చ జంగయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ భూముల పరిరక్షణ సమితి చైర్మన్ పల్లపు విజయ్, రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మచ్చ జంగయ్య కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# జనహృదయనేత నిరంజన్ రెడ్డికి జననీరాజనం



**వనపర్తి, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి 67వ జన్మదిన వేడుకలు వనపర్తిలో ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ కాన్వాయ్‌తో స్వాగతం పలికారు. యువత అధ్యక్షులు సూర్యవంశం గిరి, చిట్యాల రాము, సునీల్ వాల్మీకి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. వేదపండితులు, మతపెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. అభిమాని మోహన్ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.


నాగవరం గ్రామంలో కూడా రక్తదాన శిబిరం నిర్వహించారు. అభిమానులు, నాయకులు బాణసంచా కాల్చి, పూలదండలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, జోహెబ్ హుస్సేన్, వివిధ మండలాల నాయకులు లక్ష్మారెడ్డి, మాణిక్యం, రఘుపతి రెడ్డి, ఎద్దుల కరుణశ్రీ, వనం రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు దసరా శుభాకంక్షాలు తెలిపిన యువ నాయకుడు శివ




**కడ్తాల్, అక్టోబర్ 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన స్వగ్రామమైన కొండారెడ్డి పల్లికి వచ్చిన సందర్భంగా రేవంత్ మిత్ర మండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ అలీ ఆధ్వర్యంలో కడ్తాల్ పట్టణానికి చెందిన యువ నాయకుడు పోతగళ్ల శివ మర్యాదపూర్వకంగా సిఎంను కలిసి దసరా శుభాకంక్షాలు తెలిపినట్లు తెలిపారు.

# రాజన్న గుడిలో భక్తుల రద్దీ



**వేములవాడ, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు ధర్మగుండంలో స్నానం ఆచరించి స్వామివారికి కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి స్వామివారి దర్శనార్థం భక్తులు వేచి చూశారు.

# ఘనంగా డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కడ్తాల్, అక్టోబర్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఎంపీటీసీ ఫోరం, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో టపాకాయలతో కేక్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మైసిగండి మైసమ్మ అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు మాట్లాడుతూ తన విద్యార్థి దశ నుండి యూత్ కాంగ్రెస్ నాయకుడిగా మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పార్టీ కష్టాల్లో నష్టాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ అధికారంలో ఉన్న అధికారంలో లేకున్నా పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గాని మరియు పార్లమెంట్ ఎన్నికల గెలుపులో తన వంతు ముఖ్యపాత్ర పోషించారన్నారు. అదేవిధంగా కడ్తాల్ పట్టణానికి వార్డు మెంబర్ గా, ఉప సర్పంచ్ గా మరియు ఎంపీటీసీగా ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమ సమయంలో అధికార పార్టీలో ఉండి కూడా ప్రత్యేక తెలంగాణ కోసం తన వంతు కృషి పోషించారన్నారు. అలాగే కడ్తాల్ గ్రామాన్ని రంగారెడ్డి జిల్లాలో కలవడం కోసం మరియు అదేవిధంగా తనకున్న రిఫరెన్స్ తో కడ్తాల్ గ్రామాన్ని మండలంగా రావడానికి ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఎల్లప్పుడు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం ఆలోచించే వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి గారని అన్నారు. ప్రజా సమస్యలపై మరియు ప్రజా సంక్షేమంపై సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉన్న నాయకుడని కొనియాడారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అనుభవిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తున్నామన్నారు. అనంతరం గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. అలాగే మీ ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఇలానే ఉండాలని కోరారు. అలాగే ప్రజల కోసం, ప్రజా సమస్యల ధ్యేయంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, సేవాదళ్ అధ్యక్షుల లక్ష్మయ్య, బ్రహ్మాచారి, జహంగిర్ ఆలి, సత్యం యాదవ్, మలే మల్లేష్, జంగీర్ బాబా, బిక్షపతి, మల్లయ్య, యాదయ్య, శ్రీను, కృష్ణ, జవహర్ లాల్, లకుపతి, వడ్డే రాజు, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, ఇమ్రాన్, మండల అధ్యక్షులు బోస్ రవి, మండల సోషల్ మీడియా కన్వీనర్ కర్రోళ్ల రమేష్, టౌన్ అధ్యక్షులు బానుకిరణ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, మహేష్, రమేష్, జంగయ్య, మహేందర్, శ్రీశైలం, నరేష్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ ఉద్యోగం సాధించిన చిరంజీవికి ఘన సన్మానం



**వంగూర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూర్ మండల పరిధిలోని పోతారెడ్డి పల్లి గ్రామానికి చెందిన వావిలాల చిరంజీవి, గ్రూప్-1 పరీక్షలో 169వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ (ఏఈఎస్) ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామంలో శనివారం ఉదయం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు, స్నేహితులు కలిసి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధి కోసం నా వంతు సాయశక్తుల కృషి చేస్తాను. ప్రజల ఆశయాలను నెరవేర్చేలా పనిచేస్తాను" అని పేర్కొన్నారు. యువతకు ప్రేరణగా నిలిచే ఈ విజయాన్ని గ్రామస్థులు గర్వంగా భావించారు. సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిజాల గెల్వయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు, మాజీ సర్పంచ్‌లు చిలుక శ్రీనివాస్ రెడ్డి, బాత్క శంకర్ యాదవ్, కర్ణిక అనిత, కేశమల్ల రామస్వామి, మున్నూరు జయమ్మ, సీపీఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్ రెడ్డి, అన్నారం మాజీ సర్పంచ్ గౌరమ్మ, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖద్వారం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



**అమ్రాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల పరిధిలోని మొల్కమామిడి గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి దాతల సహకారంతో చేపట్టిన కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ప్రారంభోత్సవ అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, వృద్ధులకు దుప్పట్లు, క్రీడాకారులకు డ్రస్సులు పంపిణీ చేశారు. విజయదశమి సందర్భంగా మహిళల బతుకమ్మ సంబరాలను వీక్షించి, వారి ఆనందంలో భాగమయ్యారు. గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దినందుకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ కమిటీకి సహకరించిన దాతలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కమిటీ పెద్దలు, దాతలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ప్రజాసేవకు సిద్ధమా లేదా అధికారానికా?







స్థానిక సంస్థల ఎన్నికల సీజన్ మళ్లీ ప్రారంభమైంది. పల్లెలు, పట్టణాలు రాజకీయ చర్చలతో కళకళలాడుతున్నాయి. చాలా మంది ప్రజాసేవా తపనతో, కొందరు అధికార ఆకాంక్షతో పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంలో ప్రజా ప్రతినిధిగా మారే ప్రతి ఒక్కరూ ఒకసారి తమ మనసును అద్దంలో చూసుకోవాలి. ఎన్నికలు ఒక పోటీ కాదు ఒక బాధ్యత. అభ్యర్థిత్వం అంటే ప్రజల విశ్వాసాన్ని కోరుకోవడం, వారిని మోసం చేయడం కాదు. కాగితాలపైన కాకుండా, మనసులో "సేవా ధర్మం" ఉండాలి.

ప్రచారంలో తప్పుడు వాగ్దానాలు, డబ్బు పంచే రాజకీయాలు, కులం-మతం ఆధారిత ప్రచారాలు ప్రజాస్వామ్యానికి మచ్చ. అభ్యర్థులు ఎన్నికల నియమాలు పాటించకపోతే చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రజలు నేడు తెలివైనవారు. ఎవరు వాస్తవ సేవకులు, ఎవరు ప్రయోజన రాజకీయ నాయకులు అనే తేడా వారికి స్పష్టంగా తెలుసు. నిజమైన నాయకుడు పదవిని గెలుచుకోవడమే కాదు ం ప్రజల గుండెల్లో నిలవడమే గొప్ప విజయం. వనపర్తి వంటి జిల్లాలు ఆచరణాత్మక ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా నిలవాలి. ఎన్నికలు ఉత్సవంగా జరగాలి, యుద్ధంగా కాదు.

**నీలగిరి ఎక్స్‌ప్రెస్ అభిప్రాయం**
ప్రజాసేవ పట్ల నిబద్ధతతో, నియమాల పట్ల గౌరవంతో వ్యవహరించే వారే రేపటి నాయకులు. మిగతావారు ఎన్నికలతో వస్తారు... మరి ఎన్నికలతోనే మాయమవుతారు.

జి రామకృష్ణారెడ్డి
( సీనియర్ జర్నలిస్ట్)



## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం పథ సంచలన్‌కు కరీంనగర్ సిద్ధం



**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం అయోధ్యపురి మండలం -1, కరీంనగర్ జన్మశతాబ్ది ఉత్సవాల సందర్భంగా పథ సంచలన్ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వేదికగా లక్ష్మీనగర్‌లోని కేఈఎస్ గార్డెన్స్‌ను ఎంపిక చేశారు. స్వయంసేవకుల పథ సంచలన్ కేఈఎస్ గార్డెన్స్ నుండి ప్రారంభమై కమాన్ చౌరస్తా, బోయవాడ రావిచెట్టు, శాస్త్రి రోడ్ మీదుగా టీటీడీ కళ్యాణ మండపం వరకు సాగనుంది. అనంతరం తిరిగి గార్డెన్స్ చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ పథ సంచలన్ కార్యక్రమం కరీంనగర్ నగరంలో ఆధ్యాత్మికత, దేశభక్తి, సామాజిక ఐక్యతకు ప్రతిరూపంగా నిలవనుంది. స్వయంసేవకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

## రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకోం

### -బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి హెచ్చరిక



**వేములవాడ, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయాన్ని మూసివేస్తే ఊరుకోబోమని, హిందూ మనోభావాలను దెబ్బతీసే కుట్రగా భావిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి స్పష్టం చేశారు. వేములవాడ రూరల్ బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "కాశి, ఉజ్జయిని ఆలయాల అభివృద్ధిలో భక్తులకు దర్శనాలు నిలిపివేయలేదు. మరి రాజన్న ఆలయంలో ఎందుకు?" అని ప్రశ్నించారు. ఆలయంలో ఉన్న దర్గాను ప్రత్యేక స్థలానికి తరలించాలని, లేకపోతే బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, బండ మల్లేశం, గోపాడి సురేందర్ రావు, బురుగుపల్లి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు చివరి తేదీ అక్టోబర్ 10

### విద్యార్థులు అపోహలు లేకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచన



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో 2025 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు చివరి తేదీ అక్టోబర్ 10 అని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్, విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త ఎం. అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంటర్, ఐటీఐ లేదా ఇతర డిప్లమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పొందే డిగ్రీ, రెగ్యులర్ డిగ్రీకి సమానమేనని, విద్యార్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా అభ్యసించాలని సూచించారు. అక్టోబర్ 10 లోపు ఓపెన్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందాలని సూచిస్తూ, 2వ మరియు 3వ సంవత్సర విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో 10వ తరగతి మెమో, ఇంటర్ మెమో లేదా ఇతర అర్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫోటోలను అప్‌లోడ్ చేసి ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఏదైనా సందేహాలు ఉన్న విద్యార్థులు 7382929779 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు లేదా నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలను ప్రత్యక్షంగా సంప్రదించవచ్చని సూచించారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం



**వెల్దండ, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉమ్మడి చెదురుపల్లి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడింది. ఈ టోర్నమెంట్‌లో దుబ్బాతండా, పోచమ్మగడ్డ తండా, చెదురుపల్లి జట్లు పాల్గొని ఉత్సాహభరితంగా పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో పోచమ్మగడ్డ తండాను ఓడించి చెదురుపల్లి జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ వైస్ ఎంపీపీ కొమ్మగోని వెంకటయ్య, విజేత జట్టుకు రూ.15,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "యువతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. క్రీడలను ఉన్నత స్థాయిలో ఆడాలనే లక్ష్యంతో ముందుకు సాగే వారికి అవసరమైన సహాయం అందిస్తాను" అని తెలిపారు. కార్యక్రమంలో చెదురుపల్లి యువ నాయకులు పోలె అశోక్, కొమ్ము అంజి, మహేష్, ప్రసాద్, కిట్టు, శేఖర్, జానీ, రాజేష్ నాయక్ శివ, సందీప్, రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లష్కర్ గూడ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నందు

### ధ్వజ స్తంభ పున: నిర్మాణ మహోత్సవం



**అబ్దుల్లాపూర్ మెట్టు,అక్టోబర్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ లోని లష్కర్ గూడ గ్రామంలోని ఈరోజు ఉదయం నుండి శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయం స్వామి ధ్వజ స్తంభం పూన నిర్మాణ మహోత్సవం కార్యక్రమం వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ లస్కర్ గూడ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శ్రీ ప్రసన్నాంజనేయం స్వామి ధ్వజ స్తంభ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. మొదటి రోజు వినాయకుని హోమం రెండో రోజు ధ్వజ స్తంభం పున: నిర్మాణ నికి సంబంధించిన కార్యక్రమం ఉంటుంది మూడోరోజు ధ్వజ స్తంభ పున నిర్మాణం కార్యక్రమం అలాగే శివపార్వతుల కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది కాబట్టి గ్రామ పెద్దలు యువతీ యువకులు మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని కోరడం జరుగుతుంది.

## బీసీలకు అన్యాయం చేస్తే తగిన బుద్ధి చెబుతాం

### - బిఎస్పీ హెచ్చరిక

### -42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో అఫిడవిట్లు ఇవ్వాలని డిమాండ్




**హుస్నాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వము కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ల బిల్లుతో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో, బిఎస్పి పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గం తరఫున బీసీలకు పూర్తి మద్దతు ప్రకటించింది. రెడ్డి జాగృతి సంఘం అధ్యక్షుడు బి. మాధవ్ రెడ్డి హైకోర్టులో 50 శాతం సీలింగ్‌ను ఉల్లంఘించారంటూ కేసు వేశారు. దీనిపై స్పందించిన బిఎస్పి నేతలు, రాష్ట్రంలోని అన్ని పార్టీలు బీసీల రిజర్వేషన్లకు మద్దతుగా హైకోర్టులో అఫిడవిట్లు ఇవ్వాలని, మాధవ్ రెడ్డి కేసును వాపస్ తీసుకునేలా కృషి చేయాలని కోరారు. బీసీలకు అన్యాయం జరిగితే, తమ తడాఖా చూపిస్తారని, రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలకు ఇది గుణపాఠం అవుతుందని బిఎస్పి హెచ్చరించింది. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్, అధ్యక్షులు వెలుపల రాజు, జిల్లా నాయకులు ఎలగందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవక్కపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### తల్లి -కూతురు మృతి, పలువురు గాయాలు



**హుస్నాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవక్కపల్లి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తల్లి -కూతురు మృతి చెందారు. డీసీఎం వ్యాన్, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొనడంతో రోడ్డు పక్కన సీతాఫలాల కోసం వేచి ఉన్న ఇద్దరిపై ట్రాక్టర్ దూసుకెళ్లింది. మృతదేహాలు తీవ్రంగా నుజ్జు నుజ్జయ్యాయి. ఈ ఘటనలో కొంతమంది గాయపడినట్లు సమాచారం.

## అమ్రాబాద్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

### స్థానిక ఎన్నికలపై చర్చ, కార్యకర్తలకు సూచనలు




**అచ్చంపేట, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంబేద్కర్ ప్రజా భవన్‌లో జరిగిన అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై టీపీసీసీ ఉపాధ్యక్షులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే వారికే అవకాశాలు వస్తాయని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో హరినారాయణ గౌడ్, చింతల రాజగోపాల్, శత్రు నాయక్, కుంద మల్లికార్జున్, మల్లికార్జున్, వెంకటయ్య, బాల్ లింగం గౌడ్, రహీం, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వర రూపంలో దుర్గమ్మ దర్శనం

### నగునూరులో కనులపండువగా రథోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దసరా మరుసటి రోజున కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని శ్రీ దుర్గాభవాని అమ్మవారు అర్ధనారీశ్వర రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నంది, సింహ వాహనాలపై స్వామి అమ్మవార్లు దర్శనభాగ్యం కల్పించగా, సుందరేశ్వరుడు -దుర్గాభవానీల పట్టాభిషేకం, రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు చీరసారే, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఎస్సీ రిజర్వేషన్ లేకుండా 71 ఏండ్లు గడిచిన సముద్రాల గ్రామం

### పునఃపరిశీలన చేసి న్యాయం చేయాలని అంబేద్కర్ సంఘం డిమాండ్




**హుస్నాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
1954 నుండి 2025 వరకు 71 సంవత్సరాలు గడుస్తున్నా, సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని సముద్రాల గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ అవకాశం ఒక్కసారి కూడా కలగలేదు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కేటాయించాల్సిన సమయంలో డ్రా పద్ధతిని అనుసరించడం, రొటేషన్ విధానంలోనూ ఈ గ్రామానికి అవకాశం రాకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో దాదాపు 70 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. జనాభా పరంగా 500 మంది, ఓటర్లుగా 300 మంది ఉన్నా, గత ఏడు దశాబ్దాలుగా రిజర్వేషన్ కేటాయింపు జరగలేదు. గతంలో జనరల్, బీసీ మహిళ, బీసీ జనరల్ కేటాయింపులు జరిగినా, ఎస్సీ రిజర్వేషన్ మాత్రం ఒక్కసారి కూడా రాలేదు. ప్రస్తుతం 2025లో కూడా డ్రా పద్ధతిలో జనరల్‌గా కేటాయించబడింది. "దళితులు ఓట్లు వేయడానికే పనికివచ్చారా? పోటీ చేసే అవకాశం ఇవ్వకుండా రిజర్వేషన్ లేకుండా వదిలేయడం అన్యాయమా కాదు?" అంటూ అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు చింతకింది సింగరయ్య ప్రశ్నించారు. అధికారులు, రాజకీయ నాయకుల కుమ్మక్కుతో జరుగుతున్న ఈ అన్యాయాన్ని పునఃపరిశీలించి, సముద్రాల గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ అవసరం

### -ఆర్ఎస్ఎస్





**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల సందర్భంగా బహుపేట శాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ ఏరియాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ దవులూరి మురళీధర్, హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని తెలిపారు.1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, హిందుత్వ ఆధారిత సంస్థల ద్వారా అనేక రంగాల్లో సేవలందిస్తోందని పేర్కొన్నారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం అని, సామాజిక సమరసత, కుటుంబ విలువలు, స్వాధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి కుటుంబంలో పాటించాల్సిన అవసరం ఉందన్నారు.రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఖండ కార్యవహ దీకొండ అన్వేష్, ఎన్నం సురేందర్, స్థానిక స్వయంసేవకులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్టీ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ హైమావతి



**హుస్నాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ (స్టాటిక్ సర్విలెన్స్ టీం) శిబిరాన్ని కలెక్టర్ కె. హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వాహనాల తనిఖీ ప్రక్రియను పరిశీలించి, రిజిస్టర్‌ను వెరిఫై చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "24/7 క్షుణ్ణంగా పరిశీలన జరగాలి. వీడియో గ్రఫీ తప్పనిసరి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ విధులు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలి" అని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో లక్ష్మారెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మానసాదేవి ఆలయంలో భక్తుల రద్దీతో సందడి

**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలోని మానసాదేవి ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి క్షీరాభిషేకం, జంట 108 శివ నాగలింగాలకు జలాభిషేకం, గణపతి పూజ, పుణ్యవచనం, కుంకుమ పూజలు వైభవంగా సాగాయి.అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు



చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తి శోభతో నిండిపోయింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రసాద వితరణతో భక్తులు ఆనందంగా ఆలయం విడిచారు.

# ఉల్లంపల్లి రహదారి శిలాఫలకం ఆవేదన

**26 నెలలుగా నిలిచిన పనులు**
**ప్రజల ఆగ్రహం**





**హుస్నాబాద్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలంలోని సుందరగిరి –ఉల్లంపల్లి గ్రామాల మధ్య తారు రహదారి నిర్మాణానికి 26 నెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఒడితేల సతీష్ కుమార్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం, "నన్ను స్థాపించారు వదిలేశారు" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. పనులు ప్రారంభం కాక ప్రజలు నవ్వుతూ వెళ్తున్నారని, పాలకులు స్పందించాలని శిలాఫలకం వేదనగా నిలిచిపోయింది. చిరుజల్లుకే రహదారి చిత్తడవుతూ ప్రమాదాలకు అడ్డాగా మారిందని, నిత్యం విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఎమ్మెల్యేలు మారుతున్నారు మా రహదారి మాత్రం మారడం లేదు" అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్య వెళ్లడం లేదని ఆరోపిస్తున్నారు.

# ఆటోలో పోయిన బ్యాగు తిరిగి అందించిన పోలీసులకు కృతజ్ఞతలు




**కురవి, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శివనగర్‌కు చెందిన మహమ్మద్ సహనా బేగం తన ఇద్దరు మానవరాళ్లతో కలిసి మహబూబాబాద్‌కు వచ్చి, కురవి గేట్ వద్ద ఆటో ఎక్కి బేతోల్ స్టేజీ వద్ద దిగి చెల్లి ఇంటికి వెళ్లారు. అనంతరం తన బ్యాగ్ ఆటోలో మర్చిపోయిన విషయాన్ని గుర్తించి వెంటనే కురవి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదును స్వీకరించిన రెండో ఎస్ఐ జయకుమార్, మహిళా పోలీస్ అనిత, పోలీస్ కానిస్టేబుల్ రమేష్‌లు సాంకేతిక ఆధారాలతో ఆటో మరిపెడ వైపు వెళ్తున్నదని గుర్తించారు. వెంటనే బాధితురాలిని పోలీస్ వాహనంలో తీసుకెళ్లి పురుషోత్తమయగూడెం వద్ద ఆటోను ట్రేస్ చేసి తనిఖీ చేశారు. ఆటోలో బ్యాగ్ దొరికింది. అందులో తులం బంగారం, రెండు స్మార్ట్ సెల్‌ఫోన్లు సురక్షితంగా ఉండటం బాధితురాలికి ఊరట కలిగించింది. పోలీసుల స్పందనతో ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తన వస్తువులు తిరిగి అందించిన పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మత్తు పదార్థాలపై విస్తృత ప్రచారం చేయండి

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ఐదేళ్లు పూర్తైన సందర్భంగా, అక్టోబర్ నెలాఖరు వరకు మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పోలీస్, ఎక్సైజ్, విద్య, మహిళాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని, కళాశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, మారథాన్, సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పలువురు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సభ్యుడిని మర్యాదపూర్వకంగా కలిసిన చికోటి ప్రవీణ్

**-తాజా రాజకీయాలపై చర్చ**



**మెదక్, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును చికోటి ప్రవీణ్ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా చికోటి శివ, నిశ్చయ్, విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

**-ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**
**-ప్రభుత్వ కళాశాల స్థల పరిశీలన, హైమాస్ లైట్స్ ప్రారంభం**

**రామగుండం, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యోజకవర్గ అభివృద్ధే తన ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. గోదావరిఖనిలో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం అనుకూల స్థలాన్ని పరిశీలించారు. "విద్య ప్రతి ఇంటికి అందాలి" అనే లక్ష్యంతో నూతన విద్యా సదుపాయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కళాశాల నిర్మాణం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నదే లక్ష్యమని, త్వరితగతిన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రతి గల్లీలో వెలుతురు – హైమాస్ లైట్స్ ప్రారంభం**



టీయూఎఫ్ఐడీసీ నిధులతో 25, 38, 47వ డివిజన్లలో హైమాస్ లైట్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం ఆధునిక లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందిరనగర్ చౌరస్తా, అడ్డగుంటపల్లె వంటి బిజీ ఏరియాల్లో ట్రాఫిక్ సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు.

**దుర్గామాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే**



వైశ్య భవన్‌లో దుర్గాదేవిని దర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రజలకు సుఖసమృద్ధులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# నూతన జీఎంను సన్మానించిన ఏఐటియుసి



**గోదావరిఖని, అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి గనుల్లో జరిగిన ప్రమాదాల్లో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కార్మికులను ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య శనివారం పరామర్శించారు. మందమర్రి, ఆర్జీ టూ, భూపాలపల్లి ఏరియాల్లో గాయపడిన జె. రవీందర్, ఎ. లక్ష్మీనారాయణ, గూడెల్లి మొండయ్యలను పరామర్శించి, యూనియన్ తరఫున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట డాక్టర్ బాల కోటయ్య ఉన్నారు. అలాగే, సింగరేణి ఆర్జీ వన్ ఎస్ ఓ టూ జీ.ఎం గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌ను ఏఐటియుసి నాయకులు పూలబొకే, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మడ్డి ఎల్లా గౌడ్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్. వెంకట్ రెడ్డి, ఎం. చక్రపాణి, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, దాసరి శ్రీనివాస్, బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు, రెడ్డి వెంకట స్వామి, ఎం. రవి కుమార్, ఏవిఎస్ ప్రకాశ్, రంజిత్, ఎర్రగొల్ల చేరాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు చిన్నారుల మృతి.. ఆ దగ్గు సిరప్ అమ్మకాలు బంద్..!

**న్యూఢిల్లీ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మధ్యప్రదేశ్ చింద్వారా జిల్లాలో దాదాపు పక్షం రోజుల్లోనే ఆరుగురు పిల్లలు కిడ్నీ ఫెయిల్ అయ్యి మృతి చెందారు. ఈ ఘటన కలకలం సృష్టించింది. దగ్గు సిరప్‌తాగడం వల్లే చిన్నారులు మృతి చెందడం తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోల్డ్రిఫ్ సిరఫ్ అమ్మకాలను మధ్యప్రదేశ్ వ్యాప్తంగా నిషేధించింది. అలాగే, సిరప్ తయారీ సంస్థ ఇతర ఉత్పత్తులను సైతం నిషేధించేందుకు చర్యలకు ఉపక్రమించిది. చింద్వారాలో కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా పిల్లలు ప్రాణాలు కోల్పోయవడం చాలా విషాదకరమని సీఎం డాక్టర్ మోహన్ యాదవ్ అన్నారు. ఈ సిరప్ అమ్మకాలను మధ్యప్రదేశ్ అంతటా నిషేధించినట్లు తెలిపారు. సిరప్ తయారు చేసిన కంపెనీ ఇతర ఉత్పత్తుల అమ్మకాలను సైతం నిషేధించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.సిరప్ తయారీ కర్మాగారం తమిళనాడులోని కాంచీపురంలో ఉంది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. ఈ విషయంలో దర్యాప్తు చేయాలని తమిళనాడు సర్కారును కోరింది. ఇందుకు సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి అందింది. నివేదిక ఆధారంగా సర్కారు కఠిన చర్యలు తీసుకుంది. పిల్లల మృతి వార్త వెలుగులోకి వచ్చాక ఈ విషయంపై దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసింది. ఈ ఘటనలో దోషులను వదిలిపెట్టబోమని హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. చింద్వారాలోని పరాసియా బ్లాక్‌లో దాదాపు




15రోజుల్లో తొమ్మిది మంది పిల్లలు కోల్డ్రిఫ్ సిరప్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు చికిత్స తీసుకుంటున్నారు. ఆ సిరప్‌లో నాన్–ఫార్మాకోపోయియా–గ్రేడ్ ప్రొపైలిన్ గ్లైకాల్‌ను ఉపయోగించారని దర్యాప్తులో తేలింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలైన డైథిలిన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్‌తో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు. ఈ నివేదిక తర్వాత తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్రిఫ్ సిరప్ అమ్మకం, వాడకాన్ని నిషేధించింది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో స్టాక్‌ను ఫ్రీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీకి ఉత్పత్తిని నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తయారీ లైసెన్స్‌ను రద్దుకు షోకాజ్ నోటీస్ పంపారు. ఈ విషయంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు.. తమిళనాడు ఎఫ్‌డీఏ తమిళనాడులోని కాంచీపురంలోని శ్రీసన్ ఫార్మా నుంచి కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ నమూనాలను సేకరించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నమూనాల్లో డీఈజీ స్థాయి అనుమతించిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలిందని పేర్కొంది.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి పర్యటన నేడు

**వనపర్తి, అక్టోబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి ఆమె జీవిత భాగస్వామితో కలిసి ఈ రోజు వనపర్తికి పర్యటించనున్నారు.వివరాల్లోకి వెళితే, ఆదివారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ నుంచి కారులో శంషాబాద్, షాద్‌నగర్, బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, బూత్‌పూర్, మూసాపేట్, అడ్డాకుల, కొత్తకోట మార్గంగా వనపర్తికి బయలుదేరనున్నారు. ఉదయం 10.00 గంటలకు వనపర్తి గెస్ట్ హౌస్‌లో స్వల్ప విరామం (బ్రీఫ్ హాల్ట్) తీసుకోనున్నారు. అనంతరం ఉదయం 11.25 గంటలకు వనపర్తిలో పి ఓ సి ఎస్ ఓ, కుటుంబ కోర్టుల భవన సముదాయంతో సహా 10o2 కోర్టుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నారు.కార్యక్రమం అనంతరం లంచ్ ముగించుకుని, తిరిగి కొత్తకోట, అడ్డాకుల, మూసాపేట్, బూత్‌పూర్, జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, షాద్‌నగర్, శంషాబాద్ మార్గంగా హైదరాబాద్‌కి కారులో ప్రయాణం కానున్నారు. వనపర్తి కోర్టు భవన సముదాయాల నిర్మాణం న్యాయవ్యవస్థ అభివృద్ధికి దోహదం చేయనుందని అధికారులు పేర్కొన్నారు.

# దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుంది : రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాకిస్థాన్ ను ఉద్దేశించి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుందని ఆయన గట్టిగా చెప్పారు. దేశ పౌరుల భద్రతకు, దేశ సమగ్రతకు ముప్పు పొంచి ఉంటే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకు దిగుతామో ఇప్పటికే నిరూపించామని అన్నారు. 2016 సర్జికల్ స్ట్రైక్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్, ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ అందుకు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ‘JITO connect కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ భూభాగంలో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసినప్పుడు తాము మతం చూడలేదని, కానీ పహల్గాంలో పౌరులను మతం అడిగి చంపారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. తమ ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని, సైన్యం జోలికిగానీ, సాధారణ పౌరుల జోలికిగానీ వెళ్లలేదని రాజ్‌నాథ్ చెప్పారు. మేం ఆ పని చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవాళ్లమని, కానీ తాము అలా చేయలేదని అన్నారు.

# పీవోకే నిరసనకారులు, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం



**ఇస్లామాబాద అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత కొన్ని రోజుల నుంచి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళనలు మిన్నంటుతున్న విషయం తెలిసిందే. అయితే శనివారం నిరసనకారులు, పాక్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. హింసాత్మక ఆందోళనల్లో ఇప్పటి వరకు పది మంది మృతిచెందగా, వందలాది మంది గాయపడ్డారు. జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేకేజేఏఏసీ), ప్రభుత్వం మధ్య సెప్టెంబర్ 29వ తేదీన జరిగిన చర్చలు విఫలం కావడంతో అక్కడ హింస మొదలైంది. జేఏఏసీ ఆందోళనకారులు తీవ్ర స్థాయిలో హింసకు పాల్పడ్డారు. నిరసన సమయంలో వాహనాలకు నిప్పుపెట్టారు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో పది మంది మరణించారు. 38 పాయింట్ల ఎజెండాతో జేఏఏసీ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. తొలుత ప్రభుత్వం ఆ డిమాండ్లకు అంగీకరించలేదు. దీంతో ఆందోళన ఉధృతమైంది. పోలీసులు, పౌరులు హింసలో గాయపడ్డారు. అయితే ఇవాళ రెండు వర్గాల మధ్య డీల్ కుదిరినట్లు ప్రకటించారు. కుట్రలు, అవాస్తవాలన్నీ సమసి పోయినట్లు ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రకటించారు. జేఏఏసీతో డీల్ కుదుర్చుకున్న ప్రభుత్వ కమిటీకి ధన్యావాదాలు తెలిపారు. శాంతి, సామరస్యం ఏర్పడడం మంచి సంకేతం అన్నారు.

# జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనాయి తకాయిచి!



**టోక్యో అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జపాన్ దేశానికి తొలిసారి ఓ మహిళ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీ సనాయి తకాయిచి ని కొత్త నేతగా ఎన్నుకున్నారు. దీంతో 64 ఏళ్ల ఆ మహిళ.. జపాన్ ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి. గత కొన్నాళ్లుగా కన్జర్వేటివ్ పార్టీలో లుకలుకలు ఉన్నాయి. సంక్షోభంలో ఉన్న ఆ పార్టీని ఏకీకృతం చేసేందుకు ఆమె తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ప్రధాని షిగేరు ఇషిబా త్వరలో తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు గత నెలలో ప్రకటించారు. కన్జర్వేటివ్ నేత తకాయిచికి .. బ్రిటన్ మాజీ తొలి మహిళా ప్రధాని మార్గరేట్ థాచర్‌ను ప్రేరణగా పొందారు. ఐరన్ లేడీ అన్న ఆశయాన్ని పూర్తి చేసేందుకు సమయం ఆసన్నమైనట్లు భావిస్తున్నారు. సేమ్ సెక్స్ మ్యారేజీలను తకాయిచి వ్యతిరేకించారు. మాజీ ప్రధాని షింజో అబే బాటలో ఆమె నడవాలనుకుంటున్నారు. అబే ఆర్థిక విజన్‌కు మళ్లీ జీవం పోయాలని ఆమె ఆశిస్తున్నారు. జపాన్ రాజ్యాంగాన్ని రివైజ్ చేయాలని కూడా ఆమె భావిస్తున్నారు.

# గ్రామ సర్పంచ్‌కి ఉండవలసిన లక్షణాలు






సర్పంచ్ అనే పదం కేవలం ఒక అధికార పదవి కాదు అది ఒక బాధ్యత. గ్రామం మొత్తం తమ భవిష్యత్తును, తమ సమస్యల పరిష్కారాన్ని సర్పంచ్ చేతుల్లో పెడుతుంది. కాబట్టి ఒక మంచి సర్పంచ్ ఉంటే గ్రామం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుంది, లేకపోతే వెనుకబడిపోతుంది.

**నిజాయితీ – ప్రజల విశ్వాసానికి పునాది**

సర్పంచ్ నిజాయితీగా ఉండాలి. ప్రజల డబ్బును తన సొంత ధనంలా కాపాడాలి. అవినీతి, దుర్వినియోగం, పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి. అప్పుడు మాత్రమే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

**సేవా భావం –పదవి కాదు, బాధ్యత**

మంచి సర్పంచ్ పదవిని కుర్చీగా కాకుండా, ప్రజాసేవా వేదికగా చూడాలి. పేదల సమస్యలు వినాలి. వృద్ధులు, రైతులు, మహిళలు, యువత అందరి సమస్యలపై దృష్టి పెట్టాలి. రోజూ ప్రజల్లో తిరుగుతూ, వారి కష్టాలను తెలుసుకోవడం నిజమైన సేవకే సంకేతం.

**నాయకత్వం – అందరినీ కలుపుకునే శక్తి**

గ్రామంలో గొడవలు రావడం సహజం. కానీ వాటిని పరిష్కరించడం సర్పంచ్ బాధ్యత. అందరినీ కలుపుకుని నడిపే గుణం, సమన్వయం చేయగల నైపుణ్యం ఉండాలి. అభివృద్ధి కోసం యువత, మహిళలు, రైతులను ప్రోత్సహించాలి.

**అవగాహన – జ్ఞానం**

ప్రభుత్వ పథకాలపై అవగాహన లేకపోతే ప్రజలకు ప్రయోజనం ఉండదు. కాబట్టి సర్పంచ్‌కి పథకాలపై పూర్తి అవగాహన, కొత్త సాంకేతికాలు, డిజిటల్ పద్ధతులపై పరిజ్ఞానం ఉండాలి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం అన్నింటిపై శ్రద్ధ పెట్టాలి.

**ధైర్యం – న్యాయం**

నిజమైన నాయకుడు ఒత్తిడులకు లోనుకాకుండా, సరైనదే చేయగల ధైర్యం కలిగి ఉండాలి. కులం, మతం, పార్టీ అన్న తేడాలు చూడకుండా సమానంగా వ్యవహరించాలి. ప్రజా ప్రయోజనం కోసం నిలబడటమే గొప్ప న్యాయం.

**వినడం – కమ్యూనికేషన్**

సర్పంచ్‌కి వినగలిగే గుణం తప్పనిసరి. ప్రజల మాట ఓపికగా వింటేనే వారి గుండెల్లో స్థానం సంపాదిస్తాడు. మాట్లాడే ఒక్క మాటే ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఉండాలి. ప్రభుత్వ అధికారులు, మీడియాతో సమర్థంగా మాట్లాడగలగాలి.

**ఐకమత్యం – సమన్వయం**

గ్రామం అభివృద్ధికి ఐకమత్యమే మూలం. వార్డు సభ్యులు, గ్రామ సిబ్బందితో స్నేహపూర్వకంగా పని చేయాలి. చిన్న విభేదాలు పెద్ద గొడవలుగా మారకుండా అడ్డుకోవాలి.

సర్పంచ్ అంటే కేవలం పదవి కాదు అది ప్రజల విశ్వాసం. తన గ్రామం బాగు కోసం గుండెతో పని చేసే వ్యక్తే నిజమైన సర్పంచ్.

**వ్యాసకర్త**
---------------
కాశావేణి రాకేష్
హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్
నీలగిరి ఎక్స్‌ప్రెస్



# విచారణ లేకుండా ఇళ్లను కూల్చడం చట్టాన్ని ఉల్లంఘించడమే

- ఆర్టికల్ 21 ప్రకారం ఆశ్రయం పొందటం ప్రాథమిక హక్కు
-సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్



**న్యూఢిల్లీ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ కీలకవ్యాఖ్యలు చేసారు. భారత న్యాయవ్యవస్థ బుల్డోజర్ పాలనతో కాకుండా చట్టబద్ద పాలన ద్వారా పని చేస్తుందన్నారు. ”అతి పెద్ద ప్రజాస్వామ్యంలో చట్ట పాలన ” అనే అంశంపై మారిషస్‌లో జరిగిన ఒక సదస్సులో సిజెఐ మాట్లాడుతూ విచారణ, చట్టపరమైన ప్రకియ లేకుండా ఇళ్లను కూల్చడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆశ్రయం పొందటం, నివసించడం పౌరుల ప్రాథమిక హక్కు అని వివరించారు. నిర్ధారణ కాకుండా నిందితుల ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదని, తాను ఇచ్చిన తీర్పుతో ఇళ్ల కూల్చివేతను నిలుపు చేసామని ఆయన గుర్తు చేశారు. న్యాయమూర్తి ఒకేసారి జ్యూరీ, ఉరిశిక్షకుడిగా వ్యవహరించలేరన్నారు. భారత రాజ్యాంగం అమల్లో ఉన్న ఈ 75 సంవత్సరాల్లో చట్ట నియమం అనే భావన చట్ట గ్రంధాలకు మించి అభివృద్ధి చెంది సామాజిక, రాజకీయ రంగాల్లో ఒకే విధంగా వ్యాపించిందని విశ్లేషించారు. చట్ట పాలన అనేది కఠినమైన సిద్ధాంతం కాదని, పార్లమెంట్, ప్రజలు, దేశాల చరిత్ర మధ్య అనేక తరాలుగా జరిపే సంభాషణగా అభివర్ణించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌లను ప్రస్తావిస్తూ దేశ చట్టబద్ద పాలనలో వారి దృక్పథం అంతర్లీనంగా కనిపిస్తుందన్నారు. అధికారంలో ఉన్నవారితో సహా ప్రతి వ్యక్తీ చట్టాన్ని పాటించాలన్నారు. ఈ సదస్సులో మారిషస్ అధ్యక్షులు ధరంబిర్ గోఖుల్, ప్రధాన మంత్రి నవీన్ చంద్ర, ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి రెహానా ముంగ్లి గుల్బుల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ బొమ్మతో రానున్న ఒక డాలరు నాణెం !




**వాషింగ్టన్ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వచ్చే ఏడాది అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బొమ్మతో ఒక డాలరు నాణాన్ని ముద్రించాలని అమెరికా ఆర్థిక విభాగం యోచిస్తోందని సంబంధిత విభాగ వర్గాలు తెలిపాయి. నాణానికి ఒకవైపు ట్రంప్ చేతి పిడికిలి బిగించి పైకి ఎత్తిన చిత్రం దానితో పాటే ‘ఫైట్, ఫైట్, ఫైట్’ అని రాసిన పదాలు వుండేలా డిజైన్ చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా గతేడాది ట్రంప్‌పై జరిగిన హత్యా యత్నం నుండి బతికి బయటపడిన తర్వాత ట్రంప్ ప్రతిస్పందనను గుర్తుకు తెచ్చేలా ఈ డిజైన్ వుంది. ఈ మేరకు కోశాధికారి బ్రాండన్ బీచ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక నాణానికి రెండో వైపున ట్రంప్ ప్రొఫైల్ వుంటుంది. పైన ‘లిబర్టీ’ అనే పదం వుండగా, దిగువన ‘1776–2026’ అని రాసి వుంటుంది. నాణాల డిజైన్లలో వ్యక్తులను ముద్రించడంపై కాంగ్రెస్‌లో ఆంక్షలు వున్న దృష్ట్యా ప్రస్తుత చట్టం కింద ఈ ముసాయిదా చిత్రాలు సవాళ్ళను ఎదుర్కొంటాయా లేదా అనేది కూడా స్పష్టంగా తెలియరావడం లేదు.

# అరేబియా సముద్రంలో ‘శక్తి’ తుఫాన్



**ఢిల్లీ అక్టోబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అరేబియా సముద్రంలో తీవ్రమైన ‘శక్తి’ తుఫాన్ ఏర్పడింది. ప్రస్తుతం గుజరాత్, పశ్చిమ–నైరుతి దిశగా తుఫాన్ కదులుతోందని వెల్లడించింది. ఈ తుఫాన్ కారణంగా ముంబైలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఇక 100 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గుజరాత్ తీరంలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది. గుజరాత్, ఉత్తర మహారాష్ట్ర, పాకిస్థాన్ తీరం వెంబడి పరిస్థితులు ఉధృతంగా ఉంటాయని అంచనా వేసింది. ఇక ముంబై, థానే, పాల్ఘర్, రారుగడ్, రత్నగిరి, సింధుదుర్గ్‌లో అక్టోబర్ 7వరకు భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దీని ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని.. అలలు భారీ స్థాయిలో ఎగిసిపడతాయని తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని.. ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.